ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





నంద్యాలలోని సంజీవనగర్ రామాలయంలో ఆకట్టుకుంటున్న రుద్రాక్షలతో పంచముఖ మహాగణపతి

కొలువుదీరిన గణనాథులు

- వైభవంగా గణేశ్ నవరాత్రులు ఆరంభం
- ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు



సింఫోని హైట్స్‌లో భక్తులకు దర్శనమిస్తున్న గణపతి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 8: నంద్యాల జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నంద్యాలలో, జిల్లాలోని గ్రామాలలో గణపతి నవరాత్రులు ఆరంభమయ్యాయి. పలు కూడళ్ల వద్ద, ఆలయాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో మండపాలను సుందరంగా అలంకరించారు. వినాయకుడిని 21 రకాల పత్రాలతో పూజించి, నైవేద్యంగా ఉండ్రాళ్లు, కుడుములు సమర్పించారు. నంద్యాలలో పలు గణపతి విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీశైలంలో పూజలందుకున్న గణపతి



చాగలమర్రిలో..



రామాలయంలో వినాయకుడి విగ్రహానికి వెండితో అలంకారం



ఎస్‌బీఐ కాలనీలో నెలకొల్పిన విజయ వినాయకుడు



బేతంచెర్ల: నాగులకట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు



రుద్రవరంలో శ్రీకృష్ణుని ప్రతిమతో విఘ్నేశ్వరుడు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోకులం షెడ్డు

దరఖాస్తుల వెల్లువ

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 8: ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం 2,050 గోకులం షెడ్లును కేటాయించింది. ప్రభుత్వం మినీ గోకులాలను మంజూరు చేయడంతో రైతన్నలు, పాడి గేదెల యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక తమ పశువులు, పాడి గేదెలు, ఎండా వానకు తడవాల్సిన అవసరం ఉండదని, ప్రభుత్వమే మినీ గోకులాల షెడ్లు నిర్మిస్తుండటంతో తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పిపోతాయని ఆనందపడ్డారు. అయితే.. కేటాయింపునకు మించి రెట్టింపు దరఖాస్తులు రైతుల నుంచి పాడిగేదెల యజమానుల నుంచి వెల్లువలా వస్తుండటంతో పశుసంవర్ధక శాఖ అధికారులు ఎవరికి ఇవ్వాలో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కర్నూలు జిల్లాకు 1200 మినీ గోకులాల షెడ్లు మంజూరైతే.. దాదాపు 2,500 దాకా దరఖాస్తులు వచ్చినట్లు జేడీ శ్రీనివాసులు తెలిపారు. అలాగే నంద్యాల జిల్లాకు 850 గోకులం షెడ్లు మంజూరైతే దాదాపు 2,180 దరఖాస్తులు వచ్చాయని నంద్యాల జేడీ మోహన్ లాల్ నాయక్ తెలిపారు. కేటాయించినదానికంటే రెట్టింపు దరఖాస్తులు రావడంతో ఎవరికి ఇవ్వాలో అర్థంగాక పశుసంవర్ధక శాఖ అధికారులు తలపట్టుకుని కూర్చున్నారు. గోరుచుట్టుపై రోకటిపోటులా మరోవైపు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తాము చెప్పిన వారికే గోకులం షెడ్లు మంజూరు చేయాలని హుకుం జారీ చేయడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- గోకుల షెడ్ల కోసం లెక్కకు మించి వచ్చిన అప్లికేషన్లు
- కర్నూలు జిల్లాలో 1200 మంజూరైతే.. 2,500 దరఖాస్తులు
- నంద్యాల జిల్లాకు 850 షెడ్లు.. 2,180 దరఖాస్తులు
- మా వారికే ఇవ్వాలంటూ ఎమ్మెల్యేల ఒత్తిళ్లు
- దిక్కుతోచని పశుసంవర్ధక శాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లాకు మొత్తం 2,050 షెడ్లు మంజూరు

పట్టించుకోని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వంలో మూగజీవాల సంరక్షణ పూర్తిగా పడకేసింది. కనీసం వాటికి నీడనిచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్ల రైతులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేసింది. మూగ జీవాలకు మేతను అందించే పథకాలకు కూడా గండి కొట్టింది. ఆ మూగ జీవాల ఉసురు తగిలిందేమో గానీ వైసీపీ ప్రభుత్వం నామరూపాల్లేకుండా పోయింది. ప్రస్తుతం అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ మళ్లీ వాటిపై దృష్టి సారించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2,050 షెడ్లను కేటాయించింది. కర్నూలు జిల్లాలో 1200 షెడ్లు, నంద్యాల జిల్లాలో 850 షెడ్లను ఏర్పాటు చేసుకునేందుకు వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్ కార్డును తప్పనిసరి చేశారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీని అందిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలు చెబితేనే

పశుసంవర్ధక శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాకు భారీ ఎత్తున మినీ గోకులం షెడ్లను కేటాయించింది. రాష్ట్రంలో అత్యధికంగా మినీ గోకులాల షెడ్లను కర్నూలు జిల్లాకు కేటాయించడం గమనార్హం. గతంలో టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను మంజూరు చేసింది. అదే రీతిలో ఈ సంవత్సరం కూడా మినీ గోకులాల షెడ్లను ఏర్పాటు చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల షెడ్లకు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన వారికే మినీ గోకులాల షెడ్లను ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. స్థలంతో పాటు కచ్చితంగా రైతు, పాడి పశువులు ఉన్న వారికే గోకులం షెడ్లను కేటాయించాల్సి ఉంది. మరోవైపు ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డును కలిగి ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారందరికీ మినీ గోకులాలను సర్దుబాటు చేసేందుకు ప్రస్తుతం అధికారులు కుస్తీ పడుతున్నారు. అయితే.. ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున తమ వారికే ఇవ్వాలంటూ పశుసంవర్ధక శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.




ఉమ్మడి కర్నూలు జిల్లాలో పశుసంపద వివరాలు

కర్నూలు జిల్లాలో 3.62 లక్షల గోజాతి పశువులు, 14.8 లక్షల గొర్రెలు, మేకలు, అదేవిధంగా 5.85 లక్షల కోళ్లు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 4.14 లక్షల గోజాతి పశువులు, 11.89 లక్షల మేకలు, గొర్రెలు, 7.5 లక్షల కోళ్లు ఉన్నాయి.

గోకులం షెడ్లకు అందిస్తున్న సబ్సిడీ వివరాలు

పశువుల గోకులం సబ్సిడీ వివరాలు (రూ.లలో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారుని వాటా
రెండు పశువులు	1.15 లక్షలు	1,03,500	11,500
నాలుగు పశువులకు	1.85 లక్షలు	1,66,500	18,500
ఆరు మించి ఉంటే	2.30 లక్షలు	2,07,500	23,000
● గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు			
20 గొర్రెలు, మేకలకు	1.31 లక్షలు	91,000	39,000
50 దాటితే	2.30లక్షలు	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200పైగా ఉంటే	1,32,000	92,000	39,600



ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్లు

మూగ జీవాలకు నిల్వ నీడ కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం గోకులం పథకాన్ని అమలులోకి తెచ్చింది. కర్నూలు జిల్లాకు ఈ పథకం ద్వారా 1200 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 850 యూనిట్లు ఏర్పాటు చేయాలని తలపెట్టింది. 70 నుంచి 90 శాతం సబ్సిడీతో వీటిని నిర్మించుకునేందుకు రైతులకు పాడిగేదెల పోషకులకు అవకాశం కల్పించింది. రైతులు, పాడి పశువుల పోషకులకు ఇది ఎంతో సువర్ణవకాశం. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ జేడీ, కర్నూలు





ఎమ్మెల్యేల సిఫారసు మేరకే గోకులం షెడ్లు

ప్రభుత్వం నంద్యాల జిల్లాకు 850 గోకులం షెడ్లను కేటాయించింది. 2,500 దాకా దరఖాస్తులు వచ్చాయి. అర్హతను బట్టి ఇచ్చేందుకు కూడా అవకాశం లేని పరిస్థితులు ఉన్నాయి. ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన రైతులు, పాడిగేదెల యజమానులు ఇచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుని వాటిని నీటి యాజమాన్య సంస్థ అధికారులకు పంపుతున్నాం.

- మోహన్‌లాల్ నాయక్, జేడీ, నంద్యాల

సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి బీసీ

బనగానపల్లె, సెప్టెంబరు 8: జిల్లాలో సమస్యలు తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి చేరుకొని తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. వివిధ వర్గాల ప్రజలు నాయకులు, పలువురు ప్రజానిధులు, టీడీపీ కార్యకర్తలు, వివిధ సమస్యలపై బీసీకి సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తుల రూపంలో వినతి పత్రం అందించారు. వివిధ వర్గాల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకొని చాలా వరకు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 8: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఈనెల 9వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు పోలీసు కార్యాలయంలో రద్దు: ఎస్పీ


నంద్యాల క్రైం, సెప్టెంబరు 8: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం నేపథ్యంలో బందోబస్తు దృష్ట్యా రద్దు చేసినట్లు తెలిపారు. అర్జీదారులు వ్యయ ప్రయాసల కోర్చి నంద్యాలకు రావద్దని ఆయన పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ వెల్లడించారు.

శ్రీశైలం జలాశయం
8 గేట్లు ఎత్తివేత

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు జలాశయం ఎనిమిది క్రస్టు గేట్లను తెరిచి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,69,839 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,832 క్యూసెక్కులు మొత్తం 2,05,660 వరద నీరు వస్తోంది. జలాశయం ఎనిమిది క్రస్టు గేట్లు ఎత్తి 2,19,096 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 2,88,232 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.9734 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,822 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



శ్రీశైలం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు



గతేడాది సెప్టెంబరు 9న అరెస్టు సమయంలో చంద్రబాబు

అరెస్టు నుంచి అసెంబ్లీకి..!



ఈ ఏడాది జూన్‌లో జరిగిన అసెంబ్లీ తొలి సమావేశాల్లో సీఎం చంద్రబాబు

- గత ఏడాది సెప్టెంబరు 9న నంద్యాలలో చంద్రబాబు అరెస్టు
- నాడు ఉప్పొంగిన జనాగ్రహానికి నేటితో ఏడాది..
- అక్రమ అరెస్టు తదనంతరం టీడీపీ కూటమికి చారిత్రక విజయం

కర్నూలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

2023 సెప్టెంబరు 9.. సరిగ్గా ఇదే రోజు టీడీపీ అధినేత, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. నంద్యాల పర్యటనలో భాగంగా చంద్రబాబు బస చేసిన ఆర్కే ఫంక్షన్ హాలును అర్ధరాత్రి ఆనాటి డీఐజీ రఘురామిరెడ్డి నేతృత్వంలో పోలీసు బలగాలు చుట్టుముట్టి అరెస్టు చేసి హంగామా సృష్టించాయి. ప్రత్యేక విమానంలో విజయవాడకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. చంద్రబాబు ససేమిరా అన్నారు. తప్పని పరిస్థితుల్లో రోడ్డు మార్గంలో చంద్రబాబును విజయవాడకు తరలించారు. అడుగడుగునా చంద్రబాబును తరలిస్తున్న పోలీసు కాన్వాయ్‌కి ప్రజలు అడ్డుపడ్డారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం.. 52 రోజులు నిరసనలు

గతేడాది సెప్టెంబరు 9న అర్ధరాత్రి జగన్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పేరిట అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. జనాగ్రహం ఉప్పొంగి కట్టలు తెంచుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనే గాక యావత్ భారతావనిలో చంద్రబాబు అరెస్టును తెలుగువారు ముక్తకంఠంతో ఖండించి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. దాదాపు 53 దేశాలలో చంద్రబాబుకు మద్దతుగా.. అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా.. నాటి జగన్ ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పల్లె మొదలు పట్నం దాకా టీడీపీ శ్రేణులతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు, తటస్థులు, మహిళలు చంద్రబాబుకు అండగా నిలిచారు. అరెస్టును నిరసిస్తూ రోజుకోరీతిలో ఆందోళనలు చేశారు. బాబు జైలుకెళ్లిన నాటి నుంచి నిర్బంధం నుంచి విడుదలై వచ్చేదాకా 52 రోజులు నిరసనలతో హోరెత్తించారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం, డోన్, బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో అప్పటి టీడీపీ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ప్రజలు నిరసనలతో హోరెత్తించారు. చంద్రబాబు అరెస్టు ఆనాటి జగన్ ప్రభుత్వం చేసిన అతి పెద్ద రాజకీయ తప్పిదం అంటూ మేధావులు విశ్లేషించారు.



నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్తత (ఫైల్)

బాబు అరెస్టుతో.. టీడీపీకి చారిత్రాత్మక విజయం

చంద్రబాబును అప్పటి వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేయడంతో టీడీపీతో ప్రజలకు మరింత అనుబంధం పెరిగింది. అప్పటి వరకు నిస్తేజంగా ఉన్న టీడీపీ శ్రేణులు సైతం చంద్రబాబునే అరెస్టు చేస్తారా..! అంటూ గర్జించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, చంద్రబాబు అక్రమ అరెస్టు తీరు.. టీడీపీ విధానాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లారు. అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు అరెస్టుపై ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టారు. అక్రమ అరెస్టుతో 52 రోజులు జైలులో ఉన్న చంద్రబాబు బయటకు వచ్చాక రెట్టింపు ఉత్సాహంతో జనంలోకి వెళ్లారు. తప్పు చేయలేదంటూ జనానికి వివరించారు. ప్రజలు అధినేతకు అండగా నిలిచారు. మేలో జరిగిన ఎన్నికల్లో ఓటెత్తారు.. వైసీపీ ప్రభుత్వానికి ఊహించని గుణపాఠం చెప్పారు. టీడీపీ కూటమిని 164 స్థానాల్లో గెలిపించి చారిత్రాత్మక విజయాన్ని అందించారు. ఉమ్మడి జిల్లాల్లో కర్నూలు, నంద్యాల పార్లమెంటు స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీకి పట్టం కట్టారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ స్థాయిలో విజయం అందించడం ఇదే ప్రథమం. అందుకు ప్రధాన కారణం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోకపోవడమే. నంద్యాలలో అరెస్టు తర్వాత.. అఖండ విజయంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. చేసిన శపథం నెరవేర్చుకున్నారు.

నాడు చంద్రబాబు ఏమన్నారంటే..

గత 45 ఏళ్లుగా తెలుగు ప్రజల కోసం నిస్వార్థంగా సేవ చేశాను.. తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం నేను ప్రాణత్యాగానికైనా సిద్ధం.. భూమ్మీద ఏ శక్తి కూడా నన్ను తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్‌కు సేవ చేయకుండా ఆపలేదు.. అని అరెస్టు సందర్భంగా చంద్రబాబు అన్నారు.





భారీ బందోబస్తు మధ్య అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేసి తీసుకెళ్తున్న సీఐడీ పోలీసులు

తుంగభద్రకు పెరుగుతున్న వరద

- నదికి 24,210 క్యూసెక్కుల నీరు విడుదల
- నేడు టీబీపీ డ్యాంకు నిపుణుల కమిటీ

కర్నూలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. డ్యాం ఎగువన పడమటి కనుమల్లో కురుస్తున్న వర్షాలకు వరద జలాశయానికి చేరుతోంది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ఆదివారం సాయంత్రానికి 1632 అడుగుల లెవెల్‌లో 101.77 టీఎంసీలు నీటి నిల్వ చేశారు. జలాశయంలోకి 35,001 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. 10 గేట్లెత్తి 24,210 క్యూసెక్కులు దిగువ శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. అదే క్రమంలో 10,791 క్యూసెక్కులు వివిధ కాలువలకు వదులుతున్నారు. డ్యాం నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో కర్నూలు జిల్లాలో ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పొంగి ప్రవహిస్తున్నది. సుంకేసుల జలాశయానికి 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గరిష్ఠ నీటి నిల్వ 1.2 టీఎంసీల నిల్వ ఉంచి వచ్చిన వరదను వచ్చినట్లుగా శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

నేడు టీబీపీ డ్యాంకు నిపుణుల కమిటీ

తుంగభద్ర డ్యాం 19వ నెంబర్ గేట్ గత నెల 10వ తేదీన కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో తెగిపోయిన గేట్ల స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేసి దాదాపు 75 టీఎంసీల నీటిని కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఆ తర్వాత వరద పెరిగి 101 టీఎంసీలకు వరద చేరింది. అయితే.. కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మిగిలిన 32 గేట్ల భద్రతపై అధ్యయనం కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్స్ రిటైర్డు మెకానికల్ ఇంజనీర్లు హర్కేష్ కుమార్, ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ప్రతినిధులతో నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటి నేడు డ్యాంను సందర్శించనుంది. 9, 10 తేదీలలో సమగ్రంగా అధ్యయనం చేసి ఆ నివేదికను సీడబ్ల్యూసీ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు అందజేస్తుంది.

బియ్యం స్వాధీనం.. వాహనాల సీజ్

తుగ్గలి, సెప్టెంబరు 8: అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ లారీని పోలీసులు అదుపులోకి తీసుకుని బియ్యంతో పాటు ఐచర్, కారును సీజ్ చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయి, జొన్నగిరి గ్రామాల మధ్య అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని ఎక్సైజ్ పోలీసులు, జొన్నగిరి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి లారీతో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకుని నలుగురుపై కేసు నమోదు చేశారు. 11 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐచర్ లారీ, కారును సీజ్ చేసి శంకర్, సురేష్, శివప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, ఏఎస్ఐ రంగస్వామి, హెడ్ కానిస్టేబుల్ జయన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కూలిన మట్టి మిద్దెలు

మహిళకు విరిగిన రెండు కాళ్లు



కూలిన మట్టి మిద్దె

వెల్దుర్తి, సెప్టెంబరు 8: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె కూలి, మహిళకు రెండు కాళ్లు విరగడంతోపాటు, చేయికి తీవ్రగాయమైంది. ఈ ఘటన వెల్దుర్తి మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి రామళ్ళకోట గ్రామం దాసరివీధిలో మట్టి మిద్దె కూలిపోయి ఇంట్లో ఉన్న జైనుబ్ బీ మీద పడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. చేతికి తీవ్రగాయమైంది. హుటాహుటిన భర్త నడిపెన్న చుట్టుపక్కల వారి సహాయంతో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. ఇల్లు కూలిపోవడంతో రూ.1లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. వెల్దుర్తి ఎస్ఐ అశోక్ శనివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వెల్దుర్తి పట్టణంలో 2వవార్డులో సువర్ణమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. వరండా, వంటగది కూలిపోయాయి. ఈ ఘటనలో కోడిపిల్లలు చనిపోయాయి. సుమారు రూ.లక్షన్న ర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. ఆ సమయంలో ఇంట్లో వ్యక్తులు బయటికి పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది.

అలాగే మండల పరిధిలోని లింగాలపల్లెలో రాజు, నాగరాజుకు చెందిన మట్టి మిద్దెలు కూలిపోయాయి. ఆ సమయంలో కుటుంబసభ్యులందరూ పొలం పనులకు వెళ్ళడంతో ప్రాణనష్టం సంభవించలేదు. ఒక్కొక్కరికి రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

సాగుకు సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.330 కోట్ల రుణం

సీఈవో విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 8: ప్రతి సంవత్సరం వివిధ జిల్లాల్లో రైతులు పొలాలను అభివృద్ధి చేసుకునేందు కోసం, పంట సాగు కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తోందని, ఈ అవకాశాన్ని అర్హులైన రైతులంతా వినియోగించుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు పంట రుణాలు అందించేందు కోసం ఆప్కాబ్ రూ.330 కోట్ల నిధులను విడుదల చేసిందని, ఇందులో రూ.20 కోట్లు రైతులు సాగు చేసే పంటలకు అవసరమైన పెట్టుబడి కోసం రూ.20 కోట్లు అందించనున్నామన్నారు. ఈ రుణాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్నామన్నారు. అదే విధంగా సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులకు రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



కాంతమ్మ(ఫైల్)



జగదీశ్వరరెడ్డి(ఫైల్)

ఆళ్లగడ్డ/ప్యాపిలి, ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.

● ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు మృతి చెందారు. హైదరాబాదు నుంచి కడప జిల్లా వేంపల్లి మండలం నంది పల్లెకు మోటారు సైకిల్‌పై కాంతమ్మ, జగదీశ్వరరెడ్డి, వెంకటసుబ్బారావు వెళ్తుండగా పేరాయిపల్లె మెట్ట వద్ద ముందు వెళ్తున్న ఐషర్ లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో కాంతమ్మ(40), ఆమె కుమారుడు జగదీశ్వరరెడ్డి(17) అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటసుబ్బారావు గాయాలతో బయట పడ్డాడని రూరల్ ఎస్ఐ హరిప్రసాదు చెప్పారు. మృత దేహాలను నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

● ప్యాపిలి మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే పెట్రోలింగ్ వాహనం డ్రైవర్ రాముడు(34) మృతి చెందాడు. పోతుదొడ్డి గ్రామం వద్ద హైవేపై ఇంజన్‌లో సమస్య రావడంతో ఓ లారీ నిలబడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోవడంతో పోలీసులు సమాచారం మేరకు పెట్రోలింగ్ వాహనం సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిలబడిపోయిన లారీని పరిశీలిస్తుండగా కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్లుతున్న లారీ అతి వేగంతో రాముడిని ఢీకొట్టింది. దీంతో రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలు జిల్లా వెల్దుర్తి పట్టణానికి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

● గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం బోయపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన మరమోని బాబు విజయవాడ నుంచి అనంతపురానికి వ్యానును తీసుకుని బయలు దేరాడు. ఆదివారం తెల్లవారుజామున ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి వెనుక నుంచి ఢీకొనడంతోపాటు పక్కనే ఉన్న మరో లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్ బాబు అక్కడి కక్కడే మరణించగా, ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా కాంగ్రెస్‌కు కొత్త సారథిగా మురళీకృష్ణ



మురళీకృష్ణ

కర్నూలు (అర్బన్), సెప్టెంబరు 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియమించారు. నగర అధ్యక్షుడిగా షేక్ జిలానీ బాషాను నియమించారు. గతంలో పని చేసిన జిల్లా అధ్యక్షుడు కే. బాబురావు, నగర అధ్యక్షుడు జాన్ విల్సన్‌ల స్థానంలో కొత్త వారిని నియామకం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ వైఎస్ షర్మిలారెడ్డి, జాతీయ, రాష్ట్ర నాయకులకు కార్యకర్తలకు వీరు కృతజ్ఞతలు తెలిపారు.

వరుసగా మూడోసారి ఎంపిక



లక్ష్మీ నరసింహ యాదవ్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 8 : నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా జె.లక్ష్మీ నరసింహ యాదవ్‌ను వరుసగా మూడోసారి ఏఐసీసీ నియమించింది. రాష్ట్రంలోని 25 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను, 6 నగరాలకు కాంగ్రెస్ అధ్యక్షు లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా లక్ష్మీనరసింహయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

హైడ్రా కూల్చిన భవనంతో నాకు సంబంధం లేదు..

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు, సెప్టెంబరు 8: హైదరాబాద్‌లో హైడ్రావారు కూల్చిన భవనంతో తనకు ఎటువంటి సంబంధం లేకున్నా.. తనను ఇరికించాలని చూస్తున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు చెన్నమ్మసర్కిల్లోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు తన భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని స్పష్టం చేశారని, అయినా నోటీసులు ఇవ్వకుండా పోలీసులు, అధికారులు దౌర్జన్యంగా తమ నిర్మాణాలు కూల్చారని కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై న్యాయపరంగా ముందుకు వెళతామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.

మూడు దుకాణాల్లో చోరీ

షట్టర్ తాళాలను పగలగొట్టి రూ.1.40 లక్షలు దోచుకెళ్లిన దొంగలు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 8: ఎమ్మిగనూరు పట్టణంలోని శివసర్కిల్‌లో శుక్రవారం రాత్రి మూడు దుకాణాల్లో దొంగలు చోరికి పాల్పడ్డారు. శివసర్కిల్‌లో ఉన్న ఎంఆర్ఎఫ్ షోరూం, రెయిన్‌బో దుస్తుల దుణం, పార్సల్ పాయింట్ దుకాణాల షట్టర్లకు ఉన్న తాళాలను పగులగొట్టి లోపల ఉన్న అద్దాలను ధ్వంసం చేసి దుకాణాల్లోకి చొరబడ్డారు. ఈ దుకాణాల్లో ఉన్న నగదును దోచుకెళ్లారు. దుకాణ యజమానులు శనివారం ఉదయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు చోరీకి గురైన దుకాణాలను పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరిలో దాదాపు రూ. 1.40 లక్షలు అపహరణకు గురైనట్లు పోలీసులు, బాధితులు తెలిపారు. దొంగల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ సమాచార కమిషనర్



ఆలయ ప్రాంగణంలో కమిషనర్ చావలి సునీల్

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాజగోపురం వద్ద వీరికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కమీషనర్ చావలి సునీల్ స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు జరిపించు కున్నారు. కమిషనర్‌ను అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యక్తి దారుణ హత్య

కర్నూలు, సెప్టెంబరు 8: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్కూరు బంగ్లా సమీపంలో లోకేశ్ (34) అనే వ్యక్తిని కొందరు కత్తులతో పొడిచి హత్య చేశారు. శనివారం ఈ దాడి జరుగగా.. తీవ్రంగా గాయపడిన లోకేష్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఉండే లోకేశ్ అనే వ్యక్తి తన భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడని అశోక్.. తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి ఈ హత్యకు పాల్పడ్డాడు. లోకేశ్ తన తల్లితో వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి భార్య, కొడుకు, ఒక కూతురు సంతానం ఉంది. లోకేశ్‌తో విభేదాలు రావడంతో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. గత కొద్ది కాలంగా లోకేశ్ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గతంలో విశాఖపట్నంలో ట్రీట్‌మెంట్ ఇప్పించారు. ఆ తర్వాత కర్నూలులో తల్లితో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి యేల్కూరు బంగ్లా సమీపంలో ఉన్న అశోక్ భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతని ప్రవర్తనకు భయపడి అశోక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. లోకేశ్ అశోక్‌ను వెంబడించాడు. అశోక్ తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి లోకేశ్‌పై కత్తులతో దాడి చేసి నరికాడు. స్థానికులు రావడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత మంది లోకేశ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



కళ్యాణ్ (ఫైల్)

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 8: మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన లింగం చిన్న కర్రెన్న కుమారుడు కళ్యాణ్(12) ఈతకు వెళ్లి మృతి చెందాడు. శనివారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కళ్యాణ్ తన మిత్రలతో కలిసి ఉదయం గ్రామ సమీపంలోని బావిలో ఈతకు వెళ్లి అందులో గల్లంతయ్యాడు. గ్రామస్థులు అక్కడికి చేరుకొని బాలుడిని బయటకు తీశారు. కుటుంబసభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కళ్యాణ్ ఉయ్యాలవాడలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

డోన్‌లో విషాదం

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

డోన్(రూరల్), సెప్టెంబరు 8: డోన్ పట్టణంలో వినాయక చవితి పండుగ రోజున విషాదం నెలకొంది. పట్టణంలోని తారకరామ నగర్‌లో శనివారం రాత్రి పడుతున్న వర్షానికి వినాయక మండపానికి కవర్ కప్పే ప్రయత్నంలో కమ్మరి కౌశిక్ (25) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పండుగ పూట యువకుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వరద బాధితులకు అండగా నిలుద్దాం

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 8: వరద బాధితులకు అండగా నిలుద్దామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరులోని కొండా గార్డెన్‌లో నిర్వహించిన ఎన్డీఏ కూటమి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో బుడమేరు వాగు ఉప్పొంగి విజయవాడ ప్రజలు సర్వం కోల్పోయారని అన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా మానవతా హృదయంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజల నుంచి విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని నియోజకవర్గం తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి చేరవేద్దామని సూచించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంజీవనగర్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న సరితాబాయి తాను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును ఎమ్మెల్యేకు అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా చిన్నారి సరితాబాయిని అభినందించారు. సమావేశంలో మహానంది ఎంపీపీ యశశ్విని, టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, కంచర్ల గోవిందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ఉల్లిమధు, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్లాపురం బాషా తదితరులు ఉన్నారు.

మద్యం కేసులో ఇద్దరిపై కేసు



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 1 : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తెలంగాణ మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం బాటిళ్ళను బైక్‌పై తీసుకుని వస్తుండగా శాతన కోట వద్ద గల కేసీ కెనాల్ కట్టపై పట్టుకున్న ట్లు వారు తెలిపారు. పట్టుబడిన వారు ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చందమాల తిరుపాలు, ఏకదంతాలు అనే ఇద్దరు నిందితుల నుంచి 55 ఇంపీరియల్ బ్లూ బాటిళ్ళు, 102 క్వాటర్ బాటిళ్లను పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి బైక్‌ను కూడా సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ తిరుపాలు, పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం



పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావుకు పోర్టబుల్ స్పీకర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మహానంది, సెప్టెంబరు 8: విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో నిర్వహించుకునే ఆత్మీయ సమ్మేళనం ఒక మధురానుభూతి మిగిలించిందని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు అన్నారు. మహానంది మండలం తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2013 నుంచి 2018 వరకు విద్య నభ్యసించిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మాట్లాడుతూ బాల్యంలో తల్లిదండ్రులు గురువైతే, విద్యా బోధనతోపాటు సమాజంలో మెలకువల నేర్పేది ఉపాధ్యాయుడే అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు పోర్టబుల్ స్పీకర్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో బండిఆత్మకూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి పేరుతో వసూళ్ల పర్వం ?

మహానంది, సెప్టెంబరు 8: మహానంది క్షేత్రంలో వినాయక చవితి పేరుతో కొంత మంది అనధికారికంగా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఆలయంలో పని చేసే కొందరు సిబ్బందితోపాటు అర్చకులు, ఆలయంలో భక్తులకు సేవలందించే కాంట్రాక్టర్ల వద్ద వారి హోదాను బట్టి మామూళ్లు వసూలు చేసినట్లు సమాచారం. సంవత్సరానికి ఒకసారి వచ్చే వినాయక చవితి వేడుకల నిర్వహణకు చాలా ఖర్చు అవుతుందని, దాదాపు రూ.లక్ష వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా చవితి పేరుతో అక్రమ వసూళ్లకు కొంతమంది సిబ్బంది పాల్పడడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

లోక కళ్యాణం కోసమే కొండ ప్రార్థన



ఆలమూరు కొండల్లో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

పాణ్యం, సెప్టెంబరు 8: లోకకళ్యాణం కోసమే కొండప్రార్థన నిర్వహిస్తున్నట్లు ఆలమూరు సీఎస్ఐ సంఘం కాపరి కొరపోలు ప్రసాదు అన్నారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో ప్రతి యేటా నిర్వహించే కొండ ప్రార్థనలో భాగంగా ఆదివారం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కొరపోలు విజయకాంత్, అశోక్, పుష్పరాజ్, దాసుబాబు, ఎర్రన్న పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ప్రయాణికులకు గాయాలు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 8: ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఓ ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడు నుంచి ఆత్మకూరుకు ఏడుగురు ప్రయాణికులు ఓ ఆటోలో ఆత్మకూరుకు బయలుదేరారు. ఆటో నల్లకాలువ గ్రామ సమీపంలో కుక్కను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బాపనంతాపురం గ్రామానికి చెందిన మనోజ్, శశికుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ శివకుమార్‌కు, మిగిలిన ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గణపయ్య పండుగ

గణనాథుడి పండుగతో ఊరూ వాడా సందడిగా మారింది. మండపాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు కూడళ్ల వద్ద, ఆలయాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వినాయకుడికి నైవేద్యంగా ఉండ్రాళ్లు, కుడుములు సమర్పించి వినాయక వ్రత కల్పం, 21రకాల పత్రాలతో పూజలు, అర్చనలు, హారతులు ఇచ్చారు.





ఆత్మకూరు అర్బన్ కాలనీలో కాశీపుత్ర వినాయకుడు

మండపాల్లో భక్తుల పూజలు



మిద్దూరులో..



బండిఆత్మకూరులో..



కొత్తపల్లిలో..



గడివేములలో..



పాములపాడులో..



వెలుగోడులో..





ఆత్మకూరులో..

గణపతి నవరాత్రులు ప్రారంభం

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. సాక్షి గణపతి ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయకుడిని నెలకొల్పి ప్రత్యేక పూజలు జరిపింది. ముందుగా ఈవో డి.పెద్దిరాజు, స్థానాచార్యులు, అర్చకులు పూజలు జరిపారు. 16న పూర్ణాహుతి, అవబృధ కార్యక్రమాలతో నవరాత్రులు ముగియనున్నాయి.

- ధర్మప్రచారంలో భాగంగా వినాయక చవితిని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఉచిత సామూహిక సేవను దేవస్థానం నిర్వహించింది. చంద్రావతి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు నిమజ్జన క్రతువు

ఆత్మకూరు, సెప్టెంబరు 8: ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో వినాయక చవితి శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. డివిజన్‌లోని పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి, ఆత్మకూరు మండలాల్లో సుమారు 150 గణేష్ విగ్రహాలను నెలకొల్పారు. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలో దాదాపు 40 విగ్రహాలు ఆయా కాలనీల్లో కొలువుదీరాయి. శని, ఆదివారాల్లో ఆయా వీధుల్లో వివిధ రూపాయల్లో నెలకొల్పిన గణనాథులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేకించి తోటగేరిలో అయోధ్య బాలరాముడి వినాయకుడు, అమ్మవారిశాలలో నాట్యగణపతి, అర్బన్‌కాలనీ మెయిన్ సెంటర్‌లో కాశీపుత్ర వినాయకుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక చవితి వేడుకల సందర్భంగా పట్టణంలోని కిషన్‌సింగ్ వీధిలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం ఆత్మకూరు పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోని వినాయక విగ్రహాలను పాములపాడు మండలం ఎర్రగూడూరు సమీపంలోని శ్రీశైలం కుడి ప్రధాన కాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

ఆత్మకూరు: వినాయక చవితిని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో సోమవారం జరిగే వినాయక శోభా యాత్రకు హాజరు కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశే ఖరరెడ్డికి వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు విన్నవిం చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వినాయక ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు కంచర్ల గోవిందరెడ్డి, అధ్యక్షుడు గరుడాద్రి సత్యనారాయణశర్మ కలిసి ఉత్సవానికి హాజరు కావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 8: నంద్యాల పట్టణంలో శనివారం వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి, శ్రీహరి దంపతులు, సిబ్బంది, సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథిక్రిష్ణ ఆధ్వర్యంలో పంచముఖి బృహచ్ఛద మహాగణపతి, బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణమండప అధ్యక్షుడు కశెట్టి క్రిష్ణమూర్తి నిర్వహణలో పర్యావరణ మహాగణపతి, సంజీవనగర్ సత్యసాయి కళ్యాణమండపం, సలీంనగర్, పద్మావతీనగర్, నూనెపల్లె, గిరినాథ్ సెంటర్ తదితర ప్రాంతా లలో వినాయకులను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో టీడీపీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: వినాయక చవితి సందర్భంగా మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 54 గణపతి విగ్రహాలు కొలువుదీరాయి. గణనాథులు మినహా అన్నీ గ్రామాల్లోని విగ్రహాలను సోమవారం సమీప కాల్వల్లో నిమజ్జనం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

మహానంది: మండలంలోని పలు గ్రామాలలో బొజ్జ గణపయ్య విగ్రహాలను నెలకొల్పారు. మహానంది ఆలయంలో వేదపండితులు గణపతి పూజ, పుణ్యావహచనంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోస్పాడు: గోస్పాడు మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 80కిపైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు.

పాణ్యం: మండలంలో దాదాపు వంద గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ చవితి ఉత్సవాలలో సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలతోపాటు తదితర పోటీలు నిర్వహించనున్నారు.

నంద్యాల రూరల్: గణనాథుల విగ్రహాలు వాడ వాడలా వెలిశాయి. తొమ్మిది రోజుల పాటుసాగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 160 విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు.

మిడుతూరు: మండలంలో అధికారికంగా 46 గణనాథుల విగ్రహాలు కొలువుతీరాయి. పైపాలెం గ్రామంలోని వినాయకున్ని ఐదు రోజులు, చౌట్కూరులో వినాయకుడికి నాలుగు రోజుల పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో 50 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. సోమవారం జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో అన్ని గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

గడివేముల: మండలంలో 70 వినాయక మండపాలను ఏర్పాటు చేసి ఉత్సవ నిర్వాహకులు గణనాథులను మండపాల్లో కొలువుదీర్చారు. మండపాల వద్ద ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

వెలుగోడు: మండలంలో మొత్తం 76 విగ్రహాలను ఏర్పాటు చేశారు మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనం చేయనున్నారు ఈ సందర్భంగా ఎస్ఐ విష్ణునారయణ మాట్లాడుతూ చీకటి పడకముందే నిమజ్జనం చేయాలని సూచించారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

- శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో ఆదివారం కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటకు చెందిన సంప్రదాయ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాణ్యంలో కొండ చిలువ హల్‌చల్



డ్రమ్ములో బంధించిన కొండ చిలువ

పాణ్యం, సెప్టెంబరు 8 : స్థానిక కేఆర్ఆర్ పాఠశాల వద్ద శనివారం 12 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. దీంతో పామును గుర్తించిన పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, స్థానికుల సహకారంతో విద్యార్థుల రక్షణ దృష్ట్యా అతికష్టం మీద డ్రమ్ములోకి పంపి అటవీ శాఖ రిస్క్ ప్రొటెక్షన్ టీంకు సమాచారం అందించారు. దీంతో ఆదివారం తెల్లవారుజామున పామును తీసుకువెళ్లి తమ్మరాజుపల్లె ఎస్ టర్నింగ్ వద్ద అటవీ సమీపంలో వదిలేశారు. కొండచిలువ 20 కిలోల బరువు, 12 అడుగుల పొడవు ఉన్నట్లు కొనిదేడు బీటు అధికారి జమాల్‌వలి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, రిస్క్‌టీం ప్రొటెక్షన్ వాచర్లు ప్రవీణ్, పునీత్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

నంద్యాల రూరల్, సెప్టెంబరు 8: రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు గురురాజ విదార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పేక్షావళిరెడ్డి తెలిపారు. ఆదివారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్, కల్చర్ హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు సాత్విక, అమూల్య ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి, విద్యార్థుల విజయాలను కొనియాడారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ..

పాణ్యం, సెప్టెంబరు 8: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఆర్జీఎం విద్యార్థుల ఎంపికైనట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నంద్యాల గుడ్‌షెపర్డ్ పాఠశాల మైదానంలో అసోసియేషన్ కార్యదర్శి బాలమద్దిలేటి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల ఎంపికలో ఆర్జీఎంకు చెందిన సీఎస్ఈ విద్యార్థులు టి.శ్రీవాణి, పి.ఉదయ్ కుమార్, టి. శ్రీలత, వై. జతిన్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు విశాఖపట్నం జిల్లా అనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు, ఎండీ శివరాం, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు.

వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ



వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా కోరారు. శుక్రవారం అర్ధరాత్రి నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు కట్ట వద్ద గల వినాయక్ ఘాట్ వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ వినాయక చవితిని ప్రజలు ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న లక్ష్మీ కాంతయ్య

నంద్యాల రూరల్, సెప్టెంబరు 8: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. నంద్యాల ప్రథమ నందీశ్వర దేవాలయంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో వడ్డెర సంఘ కార్యదర్శి చల్లా వెంకటేష్ అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెం బ్లీలో తీర్మానం చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వడ్డెర వృత్తిదారులకు పింఛన్లు ఇవ్వాలని, వడ్డెర కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చక్రధర్, జిల్లా నాయకులు శివ, సర్వేశ్వరబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డులో ప్రభుత్వ జోక్యం తగదు

వెలుగోడు, సెప్టెంబరు 8: ముస్లిం మైనార్టీకి చెందిన వక్ఫ్‌బోర్డులో ప్రభుత్వ జోక్యం తగదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం ఆయన ముస్లిం అంజుమన్ కమిటీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టాలను యథావిధిగా కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూమిన్ రసూల్, షబ్బీర్ అహమ్మద్, హిదాయత్ అలీఖాన్, అతావుల్లా, సయ్యద్‌బాషా, రఫి పాల్గొన్నారు.

చికిత్స సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డా. వీఎస్ ప్రసాద్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 8 : శస్త్ర చికిత్స అందించే సమయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఐఎంఏ ఏపీ రాష్ట్ర శాఖ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ అనుబంధ విభాగం ఛైర్మన్ డా.వీఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఐఎంఏ ఆధ్వర్యంలో నంద్యాలలో రాయలసీమ ప్రాంత వైద్యులకు వైద్య వృత్తి సంబంధిత చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, డా.అనిల్‌కుమార్ నిర్వహణలో జరిగిన సదస్సుకు డా.వీఎస్ ప్రసాద్, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనం చేసి సదస్సును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్య నిర్లక్ష్యానికి సంబంధించిన చట్టాలు, వాటికి సంబంధించి వచ్చిన సుప్రీం కోర్టు తీర్పుల గురించి వివరించారు. వైద్యులపై నిర్లక్ష్య ఆరోపణలు రాకుండా తీసుకోవా ల్సిన వైద్యపరమైన జాగ్రత్తలను డా. వీఎస్ ప్రసాద్ వివరించారు. సదస్సులో ఐఎంఏ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు డా. శ్రీహరిరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.త్యాగరాజరెడ్డి, డా. హరికుమార్‌రెడ్డి, డా. బాలమద్దయ్య, మాజీ ప్రధాన కార్యదర్శి డా.సాయిప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.వసుధారాణి, డా. పనిల్‌కుమార్, రాయలసీమ ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా టీడీపీ శ్రేణులు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 8: మండల టీడీపీ నాయకులు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ఆర్థిక, ధాన్యం సహాయం అందజేశారు. ఆదివారం మండలంలోని ఏకోడూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుమార్‌బాబు, శివకుమార్, మోహన్‌రెడ్డి, స్టాలిన్‌రాజు, నాగరాజు, సుధాకర్, బాలరాజు, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి రూ. 1,00,000 నగదు అందజేశారు. అలాగే పలు గ్రామాల నుంచి సేకరించిన నగదు, ధాన్యం, వస్తువులు టీడీపీ నాయకులు అందజేశారు.

వెలుగోడు: విజయవాడ వరద బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన చెక్కును అందించారు. శనివారం ఆత్మకూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాంబాషా, వేల్పనూరు గ్రామానికి చేరుకొని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి రూ.50,116 చెక్కును మండల అధ్యక్షులు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో అందించారు.



ఎమ్మెల్యేకు నగదు అందజేస్తున్న ఏ. కోడూరు టీడీపీ నాయకులు

చంద్రబాబు కృషి స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


డోన్‌లో వినాయకునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వరదలతో విజయవాడ ప్రజలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడుకునేందుకు సీఎం చంద్రబాబు పగలు, రాత్రిళ్లు శ్రమించారన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారని, ఇందులో భాగంగా డోన్ నియోజకవర్గం నుంచి వరద బాధితులకు తమ వంతుగా సాయం అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న విఘ్నాలన్నీ తొలగిపోయేలా వినాయకుని ఆశీస్సులు పొందడానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే కోట్ల తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, సేనా, భూమా నాగన్న, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.

నేడు నిమజ్జనం

బేతంచెర్ల, సెప్టెంబరు 8: వినాయక విగ్రహాలకు సోమవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గణేష్ ఉత్సవ మండల కమిటీ సభ్యులు తెలిపారు. వినాయకులను నిమజ్జనానికి తరలించే నిర్వహకులు పోలీసుల నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ, ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్యాపిలి, సెప్టెంబరు 8: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి శివయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరం ఆవరణలో ఆయన తన సొంత ఖర్చులతో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా మొక్కలను పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రమేష్ కుమార్

డోన్(రూరల్), సెప్టెంబరు 8: ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, డోన్ పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు నష్ట పరిహారం అందించాలని, బ్యాంకుల ద్వారా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, శివరాం, భాస్కర్ రెడ్డి, నరసింహులు, మాణిక్యం శెట్టి, అబ్దుల్ లతీఫ్, అక్బర్ బాషా, నక్కి హరి, అశోక్, రామాంజనేయులు, శ్రీను, మధుసూదన్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె


కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు సిద్ధి సత్యం

దొర్నిపాడు, సెప్టెంబరు 8: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టిమిద్దె కూలడంతో ప్రాణాపాయం తప్పింది. మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన హిజియతుల్లాకు చెందిన మట్టి మిద్దె శనివారం రాత్రి కూలింది. ఇంటిలో దంపతులు హిజయతుల్ల, ఫాతిమాబీలు నిద్రిస్తుండగా తెల్లవారు జామున ఒక్కసారిగా శబ్దం రావడంతో అప్రమత్తమై బయటకు వచ్చారు. వెంటనే మట్టి మిద్దె కూలింది. దీంతో వారు భయాందోళనకు గురయ్యా. ఇంటిలోని ఫ్రిజ్, వంట సామగ్రి, టీవీ పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు సిద్ధి సత్యం కూలిన మట్టిమిద్దెను పరిశీలించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అన్నారు.

గణేశ్ లడ్డూ రూ.3 లక్షలు


సుదర్శన్‌రెడ్డికి లడ్డూను అందిస్తున్న సభ్యులు

బనగానపల్లె, సెప్టెంబరు 8: పట్టణంలోని పెండేకంటినగర్‌లో వినాయక చవితి సందర్భంగా గణేశ్ లడ్డూను శనివారం వేలం వేశారు. అధిక సంఖ్యలో వేలం పాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెండేకంటి నగర్‌కు చెందిన గాలి సుదర్శన్‌రెడ్డి గణేశ్ లడ్డూ వేలం పాట రూ.3 లక్షలకు పాడి దక్కించుకున్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

డోన్(రూరల్), సెప్టెంబరు 8: గణేశ్ ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని డోన్ డీఎస్పీ పి. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రౌడీ షీటర్లకు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్‌లతో కలిసి డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 8: మండలంలోని ముద్దవరం గ్రామానికి చెందిన వృద్ధుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ మాసూం ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన హనుమయ్య (79) అనే వృద్ధుడు ఈ నెల 3న ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. కర్నూలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు మద్దూరు మధుశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

విఘ్నాలన్నీ తొలగిపోవాలి

డోన్, సెప్టెంబరు 8: రాష్ట్ర ప్రజల అభివృద్ధికి అడ్డుగా ఉన్న విఘ్నాలన్నీ తొలగిపోవాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.


మాయలూరు గ్రామంలో వినాయకుడి వద్ద గ్రామ పెద్దలు


చాగలమర్రిలో వినాయక విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న టీడీపీ, హిందూ సంఘం నాయకులు


బనగానపల్లె పట్టణంలోని పెండేకంటి నగర్‌లో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఊరూరా గణపయ్య వేడుకలు

● వాడవాడలా కొలువుదీరిన ఉత్సవ గణనాథులు ● సందడి చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందడి బాగా కనిపించింది. వివిధ ప్రాంతాల్లో పోటాపోటీగా భారీ విగ్రహాలను నెలకొల్పారు. ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల్లో విగ్రహాలు వేటికవే ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. విభిన్న రూపాల్లో వినాయక ప్రతిమలు భక్తులకు దర్శనమిస్తున్నాయి. గణేశ్ ఉత్సవమూర్తుల చేతుల్లో పెట్టే లడ్డూ ప్రసాదాలు కూడా భారీ సైజుల్లో ఏర్పాటు చేశారు. వివిధ వాడలు, గణేశ్ మండపాలను నిర్వాహకులు రంగురంగుల విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. విగ్రహం నెలకొల్పిన వేదికను అలంకరణ సామగ్రితో ప్రత్యేకంగా రూపొందించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల సందడి కనిపిస్తోంది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో అన్నదానం, అల్పాహారాలు పంపిణీ చేపట్టారు. చాగలమర్రి మండలంలోని కొన్ని గ్రామాల్లో నిమజ్జనం చేశారు.


ఆళ్లగడ్డలో..


బేతంచర్లలో..


చాగలమర్రిలో పులి వేషధారణలో రజక సంఘ సభ్యులు



సంజామలలో..


దొర్నిపాడులో..


కొలిమిగుండ్లలో..


బేతంచెర్ల సంజీవనగర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు


ప్యాపిలిలో...


డోన్‌లో...


రుద్రవరంలో...


అవుకులో...


కోవెలకుంట్లలో...


శిరివెళ్లలో...

రైతులను ఆదుకుంటాం: మంత్రి బీసీ


సంజామల మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల, సెప్టెంబరు 8: పాలేరు వాగు వరద ఉధృతికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం సంజామలలో పాలేరు వాగు ఉధృతికి దెబ్బతిన్న వరి పంట, వాగును టీడీపీ నాయకులు అధికారులతో కలిసి బీసీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతును పరిహారానికి ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమలో పెండేకంటి కిరణ్‌కుమార్, బత్తుల వెంకటప్రతాప్‌రెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి, బెలుం సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. డంపింగ్ యార్డు నిర్మించాలని ఎంపీడీవో విజయకుమార్‌రెడ్డి, ఏపీవో సూర్యప్రకాశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు అనిల్‌కుమార్, ఏవో సుధాకర్‌రెడ్డి, ఈవో పీఆర్‌డీ రాధికారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉపేంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ రామచంద్రుడు, పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.

విజయవాడకు విరాళాలు


టీడీపీ నాయకులకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న కమలాపురం సర్పంచ్ అర్జున్ రెడ్డి

డోన్, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితుల కోసం మేము సైతం అంటూ డోన్ నియోజకవర్గ ప్రజలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితులకు విరాళాలతో పాటు నిత్యావసర కిట్లు సేకరిస్తున్నారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో ఇప్పటికే పలువురు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఆదివారం భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ రాజా విజయకుమార్ రూ.1లక్ష విరాళం చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా అందజేశారు. కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి రూ.50వేల విరాళాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్‌లకు అందజేశారు. మొత్తం డోన్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి బియ్యం, కందిపప్పుతో పాటు ఇతర నిత్యావసర వస్తువులను సేకరించారు. ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలోని విజయవాడలోని వేయి వరద బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.వెయి విలువ చేసే నిత్యావసర కిట్లను అందజేయనున్నట్లు వలసల రామకృష్ణ, శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. దేవరబండ టీడీపీ నాయకులు వెంకటనారాయణ ఆధ్వర్యంలో 15 క్వింటాళ్ల బియ్యంను, మిద్దెపల్లి గోవిందు ఆధ్వర్యంలో 10 క్వింటాళ్ల బియ్యంను విజయవాడ వరద బాధితుల కోసం సేకరించారు.

చాగలమర్రిలో కుండపోత వర్షం


చాగలమర్రిలో జలమయమైన రహదారి

చాగలమర్రి, సెప్టెంబరు 8: చాగలమర్రి మండలంలో రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పలు రహదారులు 11.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాజోలి ఆనకట్ట వద్ద కుందూ ఉధృతి పెరిగింది. 14 వేల క్యూసెక్కులతో కుందూ నది ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. కుందూ నీటి ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంత గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీఎం సహాయక చర్యలు స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, సెప్టెంబరు 8: వరదల సమయంలో సీఎం చంద్రబాబు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యలు స్ఫూర్తిదాయకమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు రామతీర్థం అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వరద సమయంలో సీఎం చంద్రబాబునాయుడు బాధితులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, సిద్ధప్ప, వాసు పాల్గొన్నారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు


యర్రగుంట్లకు వెళ్లే రహదారిలో మరమ్మతులు చేసిన కల్వర్టు

శిరివెళ్ల, సెప్టెంబరు 8: శిరివెళ్ల నుంచి వెంకటేశ్వరాపురం గ్రామం మీదుగా యర్రగుంట్లకు వెళ్లే రహదారిలో కూలిన కల్వర్టుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా కల్వర్టు కూలిపోవడంతో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్పందించిన యంత్రాంగం మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాక నూతన కల్వర్టును నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం


రుద్రవరంలో స్నేహితురాలికి ఆర్థిక సాయమందిస్తున్న మిత్రబృందం

రుద్రవరం, సెప్టెంబరు 8 : రుద్రవరం కన్యకాపరమేశ్వరి పాఠశాలలో 2007 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ తోటి విద్యార్థిని భాగ్యలక్ష్మికి రూ.30 వేలు ఆదివారం అందించారు. భాగ్యలక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యానికి సుమారు రూ.60వేలు అవసరం కావడంతో ఈ మేరకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సురేంద్ర, గురుప్రసాద్, ఖాసిం, పుల్లయ్య, శేషు, హుసేనీ, అనిల్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

చిన్నవంగలిలో కుంట కట్టకు గండి

చాగలమర్రి, సెప్టెంబరు 8: మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోగల మల్లారెడ్డి కుంట కట్టకు ఆదివారం భారీ గండి పడింది. కుంటలో ఉన్న నీరు గండి ద్వార సమీపంలోని పంట పొలాల్లో ప్రవహించింది. రైతులు సాగు చేసిన వరి, పసుపు, మొక్కజొన్న, మినుము పంటలు నీట మునిగాయి. కుంట సమీపంలోని 200 ఎకరాల దాకా పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే పంటలు సాగు చేయడంతో వరద నీరు ముంచేసిందని రైతులు విలపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కుంట కట్టకు మరమ్మతు పనులు సరిగా చేయక పోవడం వల్లే వరద నీటి కోతకు గురైందని రైతులు ఆరోపిస్తున్నారు. కట్టకు పైభాగాన ఉన్న టీజీపీ ప్రధాన కాలువ లీకేజీ నీరు కుంటకు చేరడంతో నీటి ఉధృతితో కట్టకు గండి పడింది. దీంతో కుంటలో నీరంతా పంట పొలాలు, రహదారుల వెంట ఉధృతంగా ప్రవహించింది. పంటలు నీట మునిగి భారీగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గండి మరమ్మతులు చేపట్టి నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని టీడీపీ నాయకులు, బాధిత రైతులు కోరారు.


చిన్నవంగలిలో మల్లారెడ్డి కుంట కట్టకు పడిన గండి


చిన్నవంగలిలో పంట పొలాల్లో ప్రవహిస్తున్న వరద నీరు